క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ శాశ్వతి, క్లబ్ ప్రతినిధులు డాక్టర్లు శివ, సరళ

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరాన్ని క్లబ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్లు శివ, సరళ ప్రారంభించారు. మదనపల్లెకు చెందిన గ్లోబల్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్లు శాశ్వతి, ఆంజనేయులు, అవినాష్ బృందం మధుమేహం, ఆర్థో, కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణ, క్లబ్ ప్రతినిధులు శ్రీరాములు, మునస్వామి, కేశవరెడ్డి, ముత్యాలు, వరదారెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి..



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు: పట్టణంలోని సాయిరాం ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన మెగావె వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు పలువురికి అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు పేద రోగులకు ఎంతో మేలు చేస్తాయని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు యుగంధర్, తరింగిణి, రెడ్డిబాషా పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



గంగవరం: హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని దండపల్లెలో భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు నిర్వహించారు. ఆదికర్త గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ విభాగంలోని 100 ఆధ్యాత్మిక గ్రంథాల గురించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు, సభ్యులు భాస్కర్, బాలాజి, వాణిశ్రీ, నాగమ్మ, హేమంత్, రెడ్డెమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు చూతము రారండి..!

ఎంతో ఘన చరిత్ర కలిగిన జమీందారుల కాలం నాటి శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతుంది. ఈనెల 6వ తేదీ నుంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఆలయాన్ని శుద్ధి చేసి, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మామిడాకుల తోరణాలు కట్టి, భక్తి భావం ఉట్టిపడేలా అవసరమైన వాటిని తీర్చిదిద్దుతున్నారు.



పుంగనూరులో శ్రీవారి చక్రస్నానం నిర్వహించే పుష్కరిణి, (ఇన్‌సెట్) పుంగనూరులోని శ్రీవారి ఉత్సవ విగ్రహాలు

- వెంకన్న ఆలయానికి నూతన శోభ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వెలుగులు
- 6 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లలో ఆలయ అధికారులు

పుంగనూరు: దశాబ్దాల క్రితం ఒక వెలుగు వెలిగిన కాలక్రమంలో అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు శ్రీ కళ్యాణ వేంకటేశ్వరసామి ఆలయానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంది. అప్పట్లో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే తిరుమల–తిరుపతి దేవస్థానానికి అనుసంధానం చేస్తూ 2021 డిసెంబర్‌లో ఆలయాన్ని స్వాధీనం చేశారు. ప్రభుత్వానికి నివేదికలు పంపి, ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. కోట్లాది రూపాయల వ్యయంతో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. స్వామివారి ఉత్సవాలకు అవసరమైన రథాన్ని సైతం నిర్మించి దానిని భద్రపరిచేందుకు పెద్ద గరండాలతో రూమును సైతం నిర్మించారు. అప్పటి నుంచి టీటీడీ ఆధ్వర్యంలో నిత్య పూజలు, కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతో పాటు మళ్లీ గత వైభవం సంతరించుకుంది.

వార్షిక బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా అర్చకులు

వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ ప్రత్యేక అర్చకులను, సిబ్బంది ఏడుగురిని నియమించింది. స్థానిక ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో కంకణభట్టుతో పాటు పోటు, పరిచార, హోమ కార్యక్రమ పూజలకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. గతంలో రోజుకు పది మంది కూడ రాని భక్తుల సంఖ్య వైఎస్సార్ సీపీ పాలనలో వేలకు చేరింది. టీటీడీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌తో సహా పది మంది సిబ్బందిని నియమించి, ఉదయం నుంచి ఆలయ దర్శన భాగ్యం కల్పించడం, ఇక్కడి ప్రశాంతవాతావరణం కూడా భక్తుల సంఖ్య పెరగడానికి మరో కారణమైంది.

బ్రహ్మోత్సవాలు ఇలా..

వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ ఉదయం మొదలవుతాయి. శ్రీవారికి అభిషేకం, సాయంత్రం అంకురార్పణ సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తారు. 7న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేషవాహనం నిర్వహిస్తారు. అలాగే 8న చిన్నశేషవాహనం, సాయంత్రం హంసవాహనం, 9న ఉదయం సింహవాహనం, సాయంత్రం ముత్యపు పందిరివాహనం, 10న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమంతవాహనంపై స్వామి వారినిఊరేగిస్తారు. అలాగే 11న ఉదయం మోహిని ఉత్సవం, సాయంత్రం శ్రీవారి గరుడ సేవను వైభవంగా నిర్వహిస్తారు. 12న ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాలతో శ్రీవారిని పురవీధులలో ఊరేగిస్తారు. 13న ఉదయం శ్రీవారికళ్యాణం, సాయంత్రం గజవాహనంపై ఊరేగించి , 14న ఉదయం శ్రీవారి రథోత్సవం, సాయంత్రం ధూళోత్సవాన్ని నిర్వహిస్తారు. అలాగే 15న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తారు. 16న ఉదయం మహాశాంతి అభిషేకం, తిరుప్పాడ, సాయంత్రం శయనోత్సవంతో వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

పెరిగిన ఆదాయం

ఆలయాభివృద్ధి మూలాన కొత్త సొబగులుదిద్దుకోవడం, ఆగమ శాస్త్రబద్ధంగా నిత్య కైంకర్యాలు నిర్వహిస్తూండడంతో భక్తుల తాకిడి పెరిగింది. గతంలో వేలాది రూపాయలకే పరిమితమైన హుండీ ఆదాయం ప్రస్తుతం సుమారు నాలుగునెలలకోసారి రూ.5 లక్షల వరకు వస్తూండటం విశేషం!



పుంగనూరు పట్టణంలోని కోనేటి వద్ద వెలసియున్న శ్రీవెంకటేశ్వరస్వామిఆలయం

సారా స్వాధీనం

- 200 లీటర్ల సారా ఊట ధ్వంసం
- ఒకరు పరారీ, మహిళ అరెస్ట్

కుప్పం: సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు సార ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ మోహన్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు.. అందిన రహస్య సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులతో కలిసి కుప్పం మండలం సామిడమ్మ వంక గ్రామంలో కె.రాజ ఇంటి మీద దాడులు చేశారు. ఇది గమనించి నిందితుడు పారిపోయాడు. అతని ఇంట 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే కుప్పం మండలం దిగవబోధ గుట్ట గ్రామానికి చెందిన సాలమ్మ ఇంటి పక్కన రెండు డ్రమ్ములలో నిల్వ వుంచిన 200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి కుప్పం మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండ్ నిమిత్తం మదనపల్లె సబ్ జైలుకు తరలించారు. ఇక, పారిపోయిన రాజ కోసం గాలిస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యం



బోరు డ్రిల్లింగ్‌కు పూజలు చేస్తున్న అమరనాథ్, గ్రామస్తులు

వి.కోట: ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, వీటి పరిష్కారినికి కొత్తగా బోర్లు వేస్తున్నట్టు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని కొంగాటం పంచాయతీ గందారు మాకులపల్లెలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల వినతి మేరకు జెడ్పీ చైర్మన్ జెడ్పీ నిధులను మంజూరు చేయించారు. ఆదివారం నూతన బోరు వేయించారు. జెడ్పీ చైర్మన్ తనయుడు అమరనాథ్ భూమిపూజ చేసి ఈ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమల్‌నాథ్, రామకృష్ణంరాజు, మాజీ సర్పంచ్ చంద్రప్ప, రామచంద్రప్ప, గోపాలప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం మార్పుతో అగచాట్లు

- రొంపిచెర్ల విద్యార్థులకు 17 కిలోమీటర్ల దూరంలోని పులిచెర్ల మండలంలో పరీక్ష కేంద్రం
- ఆర్టీసీ సర్వీసులు లేక ఇబ్బందులు
- రొంపిచెర్లలోనే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి
- రొంపిచెర్లలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయరూ!



రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్లలో తమ సౌకర్యార్థం పరీక్షల కేంద్రం ఏర్పాటు చేయాలని ఇంటర్‌మీడియెట్ విద్యార్థులు కోరుతున్నారు. రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో 61 మంది, కస్తూర్బా గురుకుల పాఠశాలలో 36 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. గతంలో వీరికి పబ్లిక్ పరీక్షల కేంద్రాన్ని మండల కేంద్రానికి పొరుగునే ఉన్న మరో మండల కేంద్రం చిన్నగొట్టిగల్లులో ఉండేది. అయితే కొత్త జిల్లాల ఏర్పాటుతో ఇక్కడి ఇంటర్ విద్యార్థులకు పులిచెర్ల మండలంలోని కొత్తపేట నందవనం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షల కేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. అయితే 17 కిలోమీటర్ల దూరంలోని నందవనం జూనియర్ కాలేజీకి పరీక్షలు రాయడానికి విద్యార్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు లేవు. స్వంత వాహనాలలోగానీ ఆటోలలోగానీ వెళ్లాల్సి వస్తోంది. దీంతో సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తగు చర్యలు తీసుకుని రొంపిచెర్లలోనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసే వరకు పరీక్షల రోజుల్లో కనీసం ఆర్టీసీ బస్సులైనా ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కృష్ణమూర్తి

గుడుపల్లె: వేసవి కాలంలో తాగునీటి సమస్యలపై దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి కోరారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ, గత ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ప్రస్తుతం ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుండడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నూతనంగా బోరు వేయడం లేదా వ్యవసాయ బోరుల నుంచి అనుసంధానం చేయాలన్నారు. అలాగే పశువుల దాహార్తి తీర్చేందుకు అక్కడక్కడా నీటి తొట్టెలు ఏర్పాటు చేసి అందులో నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. సమస్యలను అధికారులు ప్రజా ప్రతినిధులు సహకారంతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణ, తహసీల్దార్ సీతారాం , ప్రజా ప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మైలేరు పండుగ



మైలేరు పండుగలో పరుగులు తీస్తున్న పశువులను నిలువరించేందుకు యత్నిస్తున్న యువకులు


బైరెడ్డిపల్లె: మండలంలోని జాలారిపల్లెలో ఆదివారం మైలేరు పండుగ సందడితో హోరెత్తింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుంచి మైలేరు పండుగ పరుగుపందెంలో వదిలిపెట్టడానికి పశువులను తీసుకువచ్చారు. ఇరువైపులా కొయ్యలతో ఏర్పాటు చేసిన అల్లెలో పశువులను వదిలిపెట్టారు. పశువులను నిలువరించడానికి యువకులు పోటీ పడ్డారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామస్తులు ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. పరుగుపందెంలో గెలుపొందిన పశువులకు సంబంధించి వాటి యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం

- వరాల వసంతంగా దీనికి పేరు
- నమాజ్‌తో పుణ్యం, ఆరోగ్యం, సత్ప్రవర్తన







నమాజ్‌లోని తక్బీర్,సజ్దా, రుకూ క్రియలు





సలాం క్రియ, పలమనేరులోని ఓ మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

పలమనేరు: ముస్లింలు అత్యంత పవిత్రమాసంగా భావించే రంజాన్ నెల ఒక్కపొద్దులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. నెలవంక కనిపించడంతో తరావీహ్ ప్రార్థనలు, ఆదివారం తెల్లవారుజాము నుంచి సహరీ ఉపవాసాలు మొదలయ్యాయి. ఈ నెలలో ముస్లింలు ధనిక, పేదా అనే తేడాలే కుండా కఠిన నియమాలతో నెల పాటు ఉపవాస దీక్ష చేస్తారు.

ప్రతి మతం వారు విశ్వసించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దైవచింతనలో వ్యాయామం మేళవించి ఆరోగ్యానికి మేలు చేసేవే. హిందువులు ఆలయాలకు వెళ్లి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసినా, గుంజీలు తీసినా, చేతులు జోడించి నమస్కరించినా ప్రతి అంశంలోనూ శారీరక వ్యాయామం ఉంది. అలాగే, క్రైస్తవులు నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో, ముస్లింల నమాజ్‌లోనూ మనిషి ఆరోగ్యానికి దోహదపడే అంశాలెన్నో ఉన్నాయి.

నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యత

ప్రస్తుతం రంజాన్ మాసం సందర్భంగా జిల్లాలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలు ప్రారంభమయ్యాయి. అల్లా దీవెనల కోసం వీరు ప్రార్థిస్తున్నారు. కేవలం అల్లాను ప్రార్థించడమే కాదు నమాజు చేస్తే సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడుతాయని, నమాజు వెనుక దాగిన అసలు పరమార్థం ఇదేనని ముస్లింల విశ్వాసం. ముస్లింలు రోజుకు ఐదుసార్లు నమాజు చేస్తారు. ఇందులో తక్బీర్, ఖియాం, రుకూ, జల్సా, సజ్దా, సలాం అనే క్రియలుంటాయి. వాటి వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి.

తక్బీర్

నమాజు మొదలు పెట్టేముందు రెండు చేతులను చెవుల వరకు తీసుకెళ్లి మళ్లీ కిందకు దించి నాభిపైన పెట్టుకుంటారు. ఈ క్రియ వల్ల చేతికి బలం చేకూరుతుంది. గుండెకు విశ్రాంతి లభిస్తుంది. రెండు చేతులను పైకెత్తి కిందకు దించడం ద్వారా శరీరంలో రక్తప్రసరణ క్రమపద్ధతిలో సాగుతుంది.

ఖియాం

నమాజు చదవడానికి నిటారుగా నిలబడటాన్ని ఖియాం అంటారు. అల్లాహ్ అక్బర్ అని తక్బీర్ ఉచ్చరిస్తూనే కుడిచేతి బొటన, చిటికెన వేలితో ఎడమచేతి మణికట్టును నాభిపై ఉంచుకుంటారు. దీంతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతుంది. దైవంపై మనస్సు లగ్నం చేస్తే మరింత ప్రశాంతత లభిస్తుంది. దీంతో రోగాలు దరి చేరవు. ముఖ్యంగా కీళ్లనొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

సజ్దా

ఈ ప్రక్రియలో పాదాలు, మోకాళ్లు, అరచేతులు, ముక్కు, నుదురు నేలను తాకుతాయి. అల్లాహ్ ఎదుట సాష్టాంగప్రమాణం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. దీంతో శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ సమపాళ్లలో అయి మెదడు చురుగ్గా పనిచేస్తుంది.. ముఖ్యంగా అల్సర్‌తో బాధపడేవారికి చాలా మంచిది. ఇక తొడ భాగంలోని కొవ్వు కరిగిపోతుంది.

రుకూ

దీని ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్ మాయమవుతుంది. రెండు చేతులను మోకాళ్లపై ఉంచుకుని నడుమును సమాంతరంగా వంచుతూ చూపును రెండుకాలి బొటన వేళ్ల మధ్యన కేంద్రీకరించాలి.దీంతో ఉదర భాగానికి మంచి వ్యాయామం కలుగుతుంది. గుండె, మెదడు సమాంతరంగా ఉండడంతో జీర్ణాశయం పనితీరు మెరుగుపడుతుంది. బొటన వేళ్ల మధ్య నరాలు ఉత్తేజమవుతాయి. దీంతో వెన్నెముక నొప్పులు మటుమాయం అవుతాయి.

సలాం

సలాం వలన మెదడుకు మంచి వ్యాయామం లభిస్తుంది. నమాజులో ఇది చివరి ఘట్టం. తలను ఒకసారి కుడివైపు తిప్పి మరోమారు ఎడమవైపు తిప్పి సలాంను ఆచరిస్తారు. నమాజ్‌ను ఆచరించే సమయంలో రెండు భుజాలపైన దైవదూతలు వేచి ఉండి తాము చేస్తున్న మంచి చెడులను గమనిస్తుంటారని భక్తుల విశ్వాసం. ఇది మెదడుకు బలాన్ని ఇవ్వడంతో పాటు నేత్రశక్తిని పెంపొందిస్తుంది.


వైభవంగా పుష్పపల్లకి



పల్లకిపై కొలువుదీరిన శ్రీగిరిజా సమేత కాళభైరవేశ్వరస్వామి

బైరెడ్డిపల్లె: మండలంలో కోట్రీపల్లె సమీపంలోని శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వైభవంగా పుష్పపల్లకి నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకిపై శ్రీగిరిజా సమేత శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

బ్రహ్మారథంపై శివపార్వతుల విహారం



బ్రహ్మారథంపై మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ

బంగారుపాళెం: మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం సాయంత్రం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ బ్రహ్మారథంపై భక్తులకు కనువిందు చేశారు. ఉదయం స్వామి, అమ్మవారి మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మరథానికి పూజలు చేసి, వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకార మంటపం నుంచి తీసుకువచ్చి బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. సతీసమేతుడైన శ్రీకామాక్షమ్మ, మొగిలీశ్వరస్వామి, బ్రహ్మరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మరథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మొగిలి శివాలయానికి చేరుకోవడంతో భక్తజన సంద్రంగా మారింది. రథంపై బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మరథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. బ్రహ్మరథోత్సవానికి బెంగళూరు ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కళాశాల యజమాని నరసరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ హెచ్‌ఎంకు వీడ్కోలు సన్మానం



హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపంజాణి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నారాయణ ఉద్యోగ విరమణ పొందారు. నారాయణ దంపతులను ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు సన్మానించి ఆయన సేవలను ప్రస్తుతించారు. సమాజాన్ని నిర్దేశించే శక్తి ఉపాధ్యాయ వృత్తికే ఉందని, ఉద్యోగ విరమణ పొందిన వారు తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ-కారు ఢీ : మహిళకు గాయాలు



గాయపడిన మహిళ

సదుం: జేసీబీ కారును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఓ మహిళ గాయపడిన సంఘటన ఆదివారం సోమల మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. రామసముద్రం మండలానికి చెందిన ఎనిమిది మంది కారులో తిరుమలకు బయలుదేరారు. సోమల సమీపంలోని పాత ఎంఆర్‌ఓ కార్యాలయ సమీపంలో జేసీబీ అదుపు తప్పి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని భాగ్యమ్మకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను సదుం ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కుప్పం: కుప్పం కడా ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కడా అధికారులు తెలిపారు.